# కొద్ది కథలు

## దెబ్బకు దెబ్బ

ఆరోజు ఆదివారమైనప్పటికీ, మరుచటిరోజు ఆఫీసరు ఊరికి వెడతానని ఆదివారంకూడ వర్కింగుడేగాపెట్టాడు. అంతక్రితం పదిసార్లు పిల్లని చూసుకోవడానికి మా ఇంటికి వచ్చి వెళ్ళమని చెప్పిపోతున్నాడు. మా అబ్బాయికి యితర రోజుల్లో శలవుదొరకదు. కనుక రేపు ఆదివారం మధ్యాహ్నం వస్తానని మా నాయనగారు మాటయిచ్చాడు, తీరా ఈ ఆదివారం ఆఫీసు పెట్టేటప్పటికి ఎట్లాగురా భగవంతుడా! చివరికి మాటయిచ్చానని మా నాయనగారు గాభరాపడ్డాడు. మీరేమి గాభరాపడకండి, నేను పర్మిషను తీసుకువస్తాను వెడదాము అన్నాను. సరే ఆ ఘడియ రానూవచ్చింది. నేను మా నాయనగారు ఆ వచ్చినాయనతో (పిల్ల మేనమామ) కలిసి జగన్నాథపురంలో పిల్లను చూసుకోవడానికి వెళ్లాము. సరే మాటా మంచిఅయింది. అమ్మాయిని తీసుకువచ్చి చూబెట్టారు. మధ్యలో నా విద్యాయోగ్యతలు, క్వాలిఫికేషన్సు అన్నిచెప్పి మానాయనగారు పిల్లనిగూర్చికూడ అడిగారు. చదువేమి లేదని, ఏదో చాకలిపద్దు వ్రాయడం, చదవడం చదువేగాని, ఎక్కువ విద్యాజ్ఞానం లేదనియు, సంగీతంకూడ చెప్పించలేదనియు, మా మూలుగా సాంప్రదాయంగానే ఉంటుందనియు చెప్పి, అసలు కుర్రవాని విషయములో సాంప్రదాయంతోబాటు కుర్రవాడు ఎడ్యుకేటెడ్ అయివుండాలని చూస్తున్నామని చెప్పాడు. ఆ మాటతో మా నాయనగారు మాట్లాడక ఊరుకున్నా, నాకుమాత్రం తలకొట్టేసినంత పనైంది. అంతమంది అడియన్సులోను ఆ విధంగా యిన్సల్టుచేయడం అంటే నాకు ఆయనమీద బలే కోపంవేసింది. వెంటనే నేను అవునండీ అందుకనే యిన్నిరోజులనుండి మేరేజి చేసికోలేదు. నాకు తగిన ఎడ్యుకేటెడ్ గరల్ సంగీతం, కుట్టు, హిందీ మొదలైనవి వచ్చిన గరల్ దొరకలేదనే యింత ఆలస్యమైంది. పాపం, వెరీ సారీ. ఈ అమ్మాయిలో నేను పైనచెప్పిన క్వాలిఫికేషన్సులో ఏ ఒక్కటి లేకపోవడం చాల.........అనేటప్పటికి ఆయన మొహం పాపం ఎట్లా వుంటుందో మీరే చెప్పండి. చచ్చానురా...దెబ్బకుదెబ్బ కొట్టాడు అని అనుకుంటూ ఏదో పని ఉన్నట్లు లోపలికి జారుకున్నాడు.

తంగిరాల హనుమంతరావు

* * *

## ఫూల్ అంటే

నేను రూమ్‌లో కూర్చొని చదువుకొంటున్నాను. అప్పుడు నా స్నేహితుని ఇంట్లోవున్న సర్వెంట్ బోయ్‌వచ్చి రంగబాబుగారూ మిమ్మల్ని అప్పారావుగారు 3-30కి రమ్మన్నారండీ అన్నాడు. సరే వస్తానని చెప్పు అన్నాను.

రంగబాబుగారూ చిన్న ఇంగ్లీషు మాటకి అర్థము చెప్పాలండీ అన్నాడు నెమ్మదిగ.

"ఫూల్ అంటె అర్థము ఏమిటండీ"

"బుద్ధిలేనివాడు" యని అర్థము.

"ఐతే నేను బుద్ధిలేనివాడినా?"

"ఎవరు అన్నారు అలాగని."

"ఎవరేమిటి, అప్పారావుగారన్నారు"

"ఏమన్నారు?"

"ఒరే ఫూల్ రంగబాబుని 3-30 కి రమ్మనమని చెప్పు" అన్నారు. అస్తమానూ ఫూల్ అని పిలుస్తారండీ. ఫూల్ అంటె అర్థము ఏమిటని అడిగితే మంచివాడని చెప్పేరండి. ఐతే మంచిదేకదా అని అనుకొన్నానండీ. అయితే ఇంక ఫూల్ అనవద్దని చెప్పు తానండి.

"ఒరె అలాకాదురా, చిన్నట్రిక్కు చెబుతాను అలాగ చెయ్యి ఇంక వాడు యీ జన్మలో అనడు" అని చెప్పి చెయ్యవలసిన విధానం బోధపరచెను.

3-30 కి మా స్నేహితుని యింటికి వెళ్ళాను. అప్పారావ్ అని పిలచేను.

"ఏమండోయ్ ఫూల్‌గారు రంగబాబు వచ్చేరండీ" అన్నాడు సర్వెంట్ బోయ్.

ఏమిజరిగిందో తెలియదుగాని వాళ్ల ఇంట్లో మంచి పెద్దనవ్వులువినపడింది. వెంటనే నా స్నేహితుడు కోపముతో బయటకువచ్చి మా పిన్నివాళ్ళదగ్గర నన్ను ఫూల్ అని పిలుస్తావురా అని సర్వెంట్ బోయ్‌ని తిట్టడము మొదలు పెట్టేడు.

"నాకేమి తెలుసండీ ఫూల్ అంటె మంచివాడు అని మీరేగదా అన్నారు. అ...అ...అందుకని మి...మి... మిమ్మల్ని ఫూ...ఫూ...ఫూల్ అని పిలచేనండీ."